బంగరు కొండా

(పిల్లల నీతి శతకము)



నారుమంచి వేంకట అనంతకృష్ణ

బంగరు కొండా

(పిల్లల నీతి శతకము)

రచన

నారుమంచి వేంకట అనంత కృష్ణ

'శంకరాభరణం' ప్రచురణలు



శంకరాభరణం

శరణం పండిత మానసాపహరణం, శశ్వద్యశఃకారణం, సరసానందద వాగ్విలాస చరణం, శబ్దార్థ సంపూరణమ్।
చరదత్యద్భుత సత్కవీశ్వరగణం, సాలంబనం 'శంకరాభరణం', నిత్యమహం స్మరామి విలసద్ వాగ్దివ్యసింహాసనమ్॥

బంగరు కొండా (పిల్లల నీతి శతకము)

నారుమంచి వేంకట అనంత కృష్ణ

'శంకరాభరణం' ప్రచురణలు : 9

ప్రథమ ముద్రణ : వికారి, ఆషాఢం. July 2019

వెల : అమూల్యము

ప్రతులకు సంప్రదించండి :

N.V.Anantha Krishna
Advocate, Plot No.80, Sri Sai Nagar, Road No.4
Opp.Sri Saibaba Temple, Nagole Post,
Hyderabad 500 068.

Mobile:9246531895
Email: ananthcourt@rediffmail.com

అనంతకవనోద్భాసము

బ్రహ్మశ్రీ యస్వీయస్.శర్మ, సరోజిని పుణ్యదంపతుల సుపుత్రులు శ్రీ నారుమంచి వేంకట అనంత కృష్ణ కవి కవిలోకమునకు సుపరిచితులే.

వీరు కొన్నాళ్ళు బ్యంకు ఉద్యోగిగా ఉండి పదవీ విరమణ చేసి, ప్రస్తుతము న్యాయవాదవృత్తియందు రాణించుచూ మరొక ప్రక్క సాహితీ పిపాసతో అనేక లౌకిక ఆధ్యాత్మిక, కావ్యాలంకారాది గ్రంథములు చదివుచు, ప్రస్తుతము పద్య రచనయందు సాధన చేయుచు తాను దిట్ట కవి యగుటయే కాక, ప్రజ పద్య వేదికను అంతర్జాలమున నిర్వహించుచు, అనేకులలో పద్యరచనాసక్తిని పెంపొందించి, అత్యల్ప సమయముననే అనల్పమగు అనేక సామాజిక ప్రబంధములు వెలయుటకు మూలమయిరి.

ఇంతవరకూ వీరు వ్రాసినవి–

లలిత పదముల మది లలిత గొలుతు, వరసిద్ధి వినాయక భక్త పాలకా, భాస్కరాదిత్య ఘ్రుణిసూర్య భక్త వరద, దివసకర వరేణ్య సవితా తిగ్మకిరణ, శ్రేయస్కరా శ్రీధరా, ఈశా భక్త కల్పద్రుమా. శతకములు, మరియు గురు సహస్రనామ స్తోత్రము.

ప్రస్తుతము అత్యల్ప సమయమునందే కనీసము ఇరువది నాలుగు గంటల వ్యవధిలోనే అనంత భావ సంపన్నమయిన బంగరుకొండా శతకము వీరు రచించిరి. ఈ శతకరచన ఇంత వేగముగా చేసిరన వీరి సాధనాగరిమ ఎంతటి అసాధారణమైనదో ఊహించగలము.

మొక్కై వంగనిది మ్రానై వంగునా అన్న సామెతను మదిలోనుంచుకొని మన పిల్లలను మనము చిన్నతనము నుండియే తీర్చి దిద్దవలసి యున్నది. ఈ విషయమునెఱింగి వీరు నీతినియమములను సుకుమారులైన బాలబాలికలకు సున్నితమైన కందములలో ఈ శతకమును వెలయించిరి.

1వ పద్యము శ్రీకారముతో ప్రారంభించి తనకుగల కావ్య నిర్మాణ దక్షతను, సంప్రదాయ నిబద్ధతను కనఁబరచిరి. 2వ పద్యములో పలువిధముల చెడినవాడెటులుండునో తెలిపి అటులుండతగదని సూచించిరి.

5,7 పద్యములలో అబద్ధమాడవలదని, ఆటలు తప్పక ఆడవలెనని, 2వ పద్యములో ప్రాతః కాలమున మేల్కొనగనే చేతులు జోడించి పరమేశ్వరుని

ప్రార్థించు విధమును తెలిపిరి. ఈనాటి తల్లిదండ్రులు కాని పెద్దలు కాని తమ పిల్లలకు ఇట్టి మంచి విషయములను సూచించుచున్న దాఖలాలు తక్కువే. అది గ్రహించిన కవి ఆ పనిని శిరసా వహించి అందులకై ఈ శతకమురచించిరి.

16వ పద్యమున జీవనపోరాటానికి సిద్ధము కమ్మని విజయము లభించునని ప్రబోధించి బాలులలో నైరాశ్యమావహించకుండా చేసిన కవి విజ్ఞత ప్రశంసనీయము.

44వ ప పద్యములో ఎప్పటిపనినప్పుడే అంకిత భావంతో చేయవలెనని పిల్లలమనసునకెక్క నూరిపోసిరి.

57వ పద్యమున మితిగా ఆరోగ్యకరమయిన పదార్థములే తినవలెనని సూచించిరి. పిల్లలకు పెట్టుతరి పెద్దలీ విషయమును గ్రహించి పాటించినచో పిల్లలు ఆరోగ్యవంతులై వర్ధిల గలరు. 88వ పద్యములో పరులమెప్పు కొఱకు అనవసరముగా అతిగా శ్రమించరాదని చక్కని బోధ చేసిరి.

100వ పద్యములో పెద్దలమాటలు ఎంత వన్నె తెచ్చునో తెలిపి పెద్దలనతిక్రమించరాదని హితముపదేశించిరి.

ఈ శతకమును పిల్లలకు నేర్పుటకై పెద్దలు కంఠస్థము చేసి తమ పిల్లలచే కంఠస్థము చేయించవలసి యున్నది. అప్పుడే ఈ సుకవి కృషికి సఫలత చేకూరును. భావి భారతపౌరులను చిన్నతనమునుండియే తీర్చి దిద్దు తలంపుతో ఇంతటి చక్కని శతకమును తక్కువ సమయములోనే మనోహరముగా వ్రాసిన నా సహోదరులను మనసారా అభినందించుచున్నాను.

ఇంకనూ పెక్కు లోకకల్యాణకర కావ్యములనేకము వీరి కలమునుండి జాలువారి సహృదయులను రంజింపఁజేయవలెనని నా ఆశ.

శ్రీమదనంతుని కృపఁగని
క్షేమముతో వరలు గాక చిన్మార్గములో
ధీమదనంతుఁడు కృష్ణుఁడు.
శ్రీమద్భారతిని శుభము చెలఁగుత సతమున్.

సజ్జన విధేయుఁడు

చింతా రామకృష్ణారావు

బంగారము వంటి నీతులకు కొండ

చిన్నప్పుడు ఒక కవిత చదివాను. "అందరిలో కొందరు ఎందరు? కొందరిలో కొందరు ఎందరు? కొందరిలో కొందరు కొందరె....." ఇలా సాగిపోతుంది. మనం ఎందరినో చూస్తూ ఉంటాం. అందరిలో కొందరు మాత్రమే విశిష్ట వ్యక్తులుంటారు. ఒక్కొక్కరిలో ఒక్కొక్క ప్రత్యేక గుణం ఉంటుంది. కొందరిలో పెక్కు గుణాల సమ్మేళనం ఉంటుంది. ఆ కొందరిలోని పరిమిత సంఖ్య గల కొందరితో మనకు అనుబంధం ఏర్పడుతుంది.

నాకు జీవితంలో తారస పడిన విశిష్ట వ్యక్తులలో శ్రీ నారుమంచి వేంకట అనంత కృష్ణ గారొకరు. వారు విద్యాధికులే, కాని... నిత్యవిద్యార్థి. విద్యతో పాటు వినయసంపద గలవారు. వృత్తిరీత్యా న్యాయవాది. ప్రవృత్తి సాహిత్య వ్యాసంగం. స్నేహశీలి. ఎప్పుడూ నవ్వుతూ, నవ్విస్తూ చురుకుగా ఉంటారు. అన్నీ తెలిసికూడ ఏమీ తెలియని అమాయకుడిగా కనిపిస్తారు (నటిస్తారు!). ఇసుమంతైనా గర్వం లేనివారు. అందరినీ ప్రోత్సహిస్తూ ఉంటారు. ఎంతమందిలో ఉన్నా తమ ప్రత్యేకతను చాటుకుంటూ అందరినీ ఆకర్షిస్తూ ఉంటారు. వారున్న చోట నవ్వులకు కొదువ ఉండదు. ఇది ఒక పార్శ్వం. మరొక పార్శ్వంలో వారు కవివరేణ్యులు. వారి కవితా పాటవం, పద్య రచనా నైపుణ్యం ఇప్పటికే వారు ప్రచురించిన పెక్కు రచనల ద్వారా అందరికీ సువిదితమే. ఛందో వైవిధ్యంతో, పద ప్రయోగ విన్యాసంతో, రసపోషణతో, ధారాశుద్ధితో వారి పద్యాలు సలక్షణమై సహృదయ రంజకంగా ఉంటాయి. ఇప్పటి వరకు దైవస్తుతి ప్రధానమైన కృతులు చేసిన వీరి దృష్టి నీతిబోధనపై పడింది. క్రొత్తగా నీతి శతకం రచించారు.

తెలుగు సాహిత్యంలో శతకాలకు ఒక విశిష్టస్థానం ఉంది. ముక్తక లక్షణం కలిగి, చెప్పేది సూటిగా స్పష్టంగా చెప్పడ వల్ల, ధారణకు యోగ్యములై శతక పద్యాలు జనాదరణ పొందాయి. తెలుగులో విస్తృతంగా వెలువడిన శతకాలలో స్తుతి ప్రధానమైనవి ముందుంటే తరువాతి స్థానం నీతి శతకాలవి. ఈ శతకాలలో సార్వజనీనమైనవి ఎక్కువగా ఉండగా, కొన్ని ప్రత్యేకంగా స్త్రీలనో, పురుషులనో, కన్యలనో, విద్యార్థులనో, పిల్లలనో (అందులోను బాలురను, బాలికలను) సంబోధిస్తూ, వారికి నీతిని బోధించేవి ఉన్నాయి.

నీతి అంటే సుగుణాలను, సచ్చరిత్రను పెంపొందించే ప్రవర్తనా నియమావళి. వ్యక్తిగతంగా, సామాజికంగా, వృత్తిపరంగా నీతి ఉండటం

అవసరం. ఎవరు ఎక్కడ ఎప్పుడు ఎలా ప్రవర్తించాలో చెప్పేవే నీతులు. అవి పాటిస్తే వ్యక్తికి, సమాజానికి హితం చేకూరుతుంది. 'విశ్వశ్రేయః కావ్యమ్' అని నమ్మే కవి సమాజ హితాన్ని కోరి నీతి శతకం వ్రాస్తాడు.

అనంత కృష్ణ గారు నీతి శతకం వ్రాసారు. ఎవరికోసం? భావి పౌరులైన పిల్లల కోసం... చిన్నప్పుడే సౌజన్యపు సద్గుణాల బీజాలు పడితే ఆ పిల్లలు ఉత్తమ పౌరులై తమ జీవితాలను సన్మార్గంలో పయనింప జేస్తూ సమాజానికి హితకారకులౌతారు. పిల్లలు కోపంతో కాకుండా బుజ్జగించి చెప్తే వింటారు. అందుకే 'బంగరు కొండా!' అని ముద్దుగా సంబోధిస్తూ, వారితో ఆత్మీయతను పెంచుకొని తన మాట వినేట్లు చేసుకుంటున్నారు. తన నీతులు సులభగ్రాహ్యంగా ఉండే విధంగా లలిత పద విన్యాసంతో, లయప్రధానమై అందంగా ఉండే కందంలో చెప్పారు. పుస్తకం మీ చేతుల్లో ఉంది. ఇందలి నీతులను, వాటిని చెప్పిన విధానాన్ని మీరే గ్రహిస్తారు.

నారుమంచి వంశ వారాశి పూర్ణ శ
శాంకమూర్తి వీ వనంత కృష్ణ!
నారు మంచి దగుట నవనవోన్మేష సా
హిత్య సస్యమే రహించు సతము.

ఇంతటి చక్కని పుస్తకానికి నన్ను కొన్ని మాటలు వ్రాయమనడం అనంత కృష్ణ గారి సౌహార్దానికి నిదర్శనం. అందుకు వారికి ధన్యవాదాలు.

కంది శంకరయ్య

అభినందనలు

సత్కవిమిత్రులు శ్రీ అనంతకృష్ణ గారు శతకము వ్రాయుట క్రొత్త కాదు. వారిది వరకే రత్నపేటికల వంటి భక్తిరసామృత చషకములైన అనేక శతకములను వ్రాసి భగవంతుని, పద్యప్రేమికులమైన మనను అలరించినారు. ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి. పద్యములను వ్రాసి చేతులు దులుపుకోకుండా సమాజ హితానికి అనేక కార్యక్రమాలను కీర్తికాంక్ష లేకుండా నిర్విరామంగా నిర్వహిస్తున్న మంచిమనిషి అనంతకృష్ణ గారు. సంస్కృతాంధ్ర భాషలపైన మంచి పట్టున్న పండితుడాయన. ఈ శతకం వ్రాస్తున్నప్పుడు ఆయన భాషపైన తనకున్న పాండిత్యాన్నంతా పక్కనబెట్టేసి తన విజ్ఞత, అనుభవాల విశ్వరూపం ప్రదర్శించినారు.

దేవుడితో కవి ఏ భాషలోనైనా మాట్లాడవచ్చును. కవిత్వం తెలిసిన పండితులకు కవిత్వపు గారడీ చూపించవచ్చును. పెద్ద సమస్య కాదు. కానీ దేవుని ప్రతిరూపాలైన చిన్నారి పొన్నారి 'బంగారు కొండ'లతో మాటామంతీ జరపటం, అందునా వాళ్ళకు నీతిబోధ చేయటం సామాన్యమైన పని కాదు. అనంతకృష్ణ గారు పసిపిల్లల స్థాయికి ఒదిగిపోయి ఆ పనిలో కృతకృత్యులైనారు. రేపటి సమాజంలో వాళ్ళు మంచి పౌరులుగా ఎదిగేలాగా సత్సంప్రదాయాలు, నియమ నిబద్ధతలు, విజయరహస్యాలు, క్రమశిక్షణ, సమయపాలన, పెద్దలను గౌరవించటం, దైవభక్తి, ఆత్మవిశ్వాసం, దీక్ష, కృషి, సమాజంలో వ్యవహరించవలసిన పద్ధతులు... ఇలా జీవితంలో అడుగడుగునా అవసరమయ్యే మెళకువలను చిన్న చిన్న మాటలతో సుందరమైన లయకలిగిన వంద కందపద్యాలలో కూర్చి భావిపౌరులకు అందించిన తీరు అద్భుతము. పద్యాలన్నీ కవిగారి మనస్సులాగే ఎంతో లలితంగా, పిల్లల హృదయాలకు పట్టించాలనే గట్టి పట్టింపుతో, నిజాయితీతో తొణికిసలాడుతున్నాయి. ప్రతి పద్యం చివరనున్న

'బంగారు కొండ!' అన్న మకుటం గుండెని పదేపదే తడుముతూ అనిర్వచనీయమైన సుఖానుభూతిని కలిగిస్తున్నది.

వారి రచనలలో ఈ శతకము ఎంతో విశిష్టమైనది. పుస్తకం మీ ముందున్నది. వడ్డించబోతూ రుచులను వర్ణించటం నేను చేయను.

ఈ శతకరచన చేసి అనంతకృష్ణ గారు సమాజానికి చేసిన నిజమైన సేవ అని నేను ప్రగాఢంగా భావిస్తూ వారిని హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను.

వి. ఆర్. గణపతి

శ్రీయుత నారుమంచి కులసింధు సుధాంశు ననంత కృష్ణు న
త్యాయత మానవత్వ విభవాన్విత సుస్మిత దివ్యనేత్రు స
త్యాయతనాంతర స్థిర విహారు మహోరుకృపా విచారు నా
త్మీయుని పద్య బాంధవుని మిక్కిలి గొల్చెద భక్తి మీరగన్.

యం.వీ. పట్వర్ధన్

స్వగతం

"ప్రజ-పద్యం" ఫేస్ బుక్ సమూహమునకు నేను సహనిర్వాహకుడను. ఇది సామాజిక అంశాలపై పద్య రచనా వ్యాసంగాన్ని ప్రోత్సహించే సంకల్పముతో ప్రారంభించినది. ఈ సమూహ సమావేశాలలో పుస్తకావిష్కరణలు కూడ జరుపుకుంటూ ఉంటాము. ఆ పరంపరలో భాగముగా బెంగళూరులో 13.7.2019 నిర్వహించుకును సమ్మేళనములో ఆవిష్కరణకు ఒక శతకము వ్రాయమని మిత్రులు పట్వర్ధన్ గారు, గణపతిగారు ప్రోత్సహించారు. వారిది అభ్యర్ధన. కానీ నాకది సుగ్రీవాజ్ఞ వంటిది. ఏ విషయము తీసుకుందామా అని ఆలోచన. సరే నా మనుమడు,మనుమరాండ్రతో మాట్లాడుతున్నట్లు పిల్లల నీతి శతకము వ్రాయాలని అమ్మ ప్రేరణ. మరి మకుటము ఏమిటి? ఇది తరువాతి ప్రశ్న. "బంగరు కొండా" ఇది సర్వ సాధారణముగా తాతలు మనుమలు, మనుమరాండ్రను ముద్దుగా పిలుచుకునే పిలుపు. అందుకే ఈ మకుటం నిర్ణయించుకున్నాను.

పిల్లలకి, వయసుతో నిమిత్తము లేకుండా, ఏది చెప్తే వారి భవిత ఒక సంస్కారవంతమైన, ఋజువర్తన గల మార్గము చూపగలమా అని ఆలోచించి, అందులో పుట్టిన భావాల పద్యానుకరణమే ఈ శతకము. శతకము అని నిర్ణయించుకున్నాము కనుక ఇంకా అనేకాంశములు చెప్పవలసి ఉన్నా పరిధి లోపలనే ఉండిపోవలసి వచ్చినది.

ఈ శతకరచనలో ఎందరో సహకరించారు. అందరికీ పేరుపేరునా నమస్సులు. ఈ డి.టి.పి. ఎలా చేయాలో నేర్పిన, మరియు

ముందుమాటను అందించిన శ్రీ కంది శంకరయ్యగారు, ఎప్పుడూ నా వెంటనుండే అన్నగారు శ్రీ చింతా రామకృష్ణారావు గారు, నన్నీ పనికి ప్రోత్సహించిన శ్రీ వి. ఆర్. గణపతి గారు, శ్రీ ఎం.వీ. పట్వర్ధన్ గారు, అలాగే పుస్తకమును అతి తక్కువ కాలములో ఇంత అందముగా ముద్రించిన కర్షక్ ప్రింటర్స్ యాజమాన్యానికి ధన్యవాదములు.

పేరు నాది, ప్రేరణ అమ్మది. గుర్వనుగ్రహము, అమ్మ దయ కూడి నాచే వ్రాయించిన ఈ శతకమును దోషములను క్షమిస్తూ, కించిత్తుగనైనా ఉన్న మంచిని ఆస్వాదిస్తారని ఆశిస్తూ, స్వస్తి.

గురుపాదధూళి

ఎన్.వి. అనంత కృష్ణ

బంగరు కొండా

కం. శ్రీ కారము చుట్టితి నే
నీ కొరకై కైతలల్లి నీతి తెలుపగా
నే కాలమ్మైన మరువకు
పైకానికి పరుగులిడకు బంగరు కొండా 1

కం. లేచిన వెంటనె మరువక
నీ చేతుల జోడ్చి దేవ నీవే గతిరా
నా చేతిని వీడకుమని
ప్రాచీనుల బాట సాగు బంగరు కొండా 2

కం. మాతా పితరుల మరువకు
ప్రాతః స్మరణీయులంట రాజులకైనన్
రోతగ వారిని తిట్టిన
పాతకమని తెలుసుకొనుము బంగరు కొండా 3

కం. నలుగురితో కలువడితడు
తెలివియె లేనట్టివాడు తెంపరి చేతల్
విలువివ్వడు విద్యలకును
పలువిధముల చెడినవాడు బంగరు కొండా 4

కం.	పలుకకుమెన్నడబద్ధము
పలుకకు పరుషంపు మాట బాధలనైనన్
పలుకగ పదుగురు మెచ్చగ
పలుకే బంగారమౌను బంగరు కొండా 5

కం.	గృహమావల పలువురు నిన్
సెహబాసని మెచ్చి నీదు చెంతకు రారే
సహవాసము చేయుటకై
బహు భాషల నేర్చుకున్న బంగరు కొండా 6

కం.	ఆటల తప్పక నాడుము
పోటీలో గొడవ పడుచు పోరకుమను నా
మాటల చెవినిడి శ్రద్ధగ
పాటించి నడచిన మేలు బంగరు కొండా 7

కం.	ఎకసెక్కమ్ముల నాడకు
పకపక మని నవ్వవలదు పదుగురి లోనన్
ఒకరి మురిపింప మానుము
బక జపమును పోలు చదువు బంగరు కొండా 8

కం.	నియమము తప్పక చదువుము
జయమది వలదన్న వచ్చు సంశయమేలా
క్రియయును కోర్కెయు జేర్చిన
భయమేల పరీక్షలన్న బంగరు కొండా 9

కం. తెలిసిన దానిని తప్పక
తెలియని వానికి తెలుపుట తెలివగు పనిలే
తెలిపెడి మిషతో నేర్తువు
వలదన్నను వాణి నిల్చు బంగరు కొండా 10

కం. పంచిన కొలది పెరిగి నీ
పంచకు తా వచ్చి చేరు వరముల వరదై
మంచిగ కొంచెమె చాలును
వంచనతో రాశులేల బంగరు కొండా 11

కం. దారము కట్టక పోయిన
తీరుగ నెగురరంగ లేదు తెగిపడి పోవున్
మారని గాలిపటము గతి
భారమగును ధర్మముడుగ బంగరు కొండా 12

కం. చదువులు చెప్పెడి గురువుల
నెదలోపల నిల్పి గొల్వుమేనాడైనన్
విదిలించినట్లు చూడకు
వదలకు మెప్పుడు విలువల బంగరు కొండా 13

కం. క్రమశిక్షణగా నుండుము
క్రమముగ సాధించు నెడల కష్టంబగునే?
క్రమశిక్షణ జయ హేతువు
భ్రమలకు లోనై మరువకు బంగరు కొండా 14

కం. కాలము కర్పూరమటుల
లీలగ కరుగుచును నుండు లేదను దనుకన్
మేలుగ వాడియు వాడక
ఫాలాక్షుని సాక్షిగాను బంగరు కొండా 15

కం. యుద్ధము నందున విజయము
సిద్ధముగానున్న యెడల సిద్ధించునులే
యుద్ధము సేయగ లెమ్మిక
బద్ధకమన్నది దునుమగ బంగరు కొండా 16

కం. సుమతీ శతకము చదువుము
గమనించుము వేమనోక్తి కంఠస్థముగా
కుమతివి కావు, కలుగు నిరు
పమ గతి సద్వర్తనమది బంగరు కొండా 17

కం. ఒకరికొరకు చదువకు నీ
వొకరిని నొప్పించు పనుల నొనరింపకుమీ
ఒకరి కొరకొకరని మదిని
ప్రకటించుకొనుచు నడువుము బంగరు కొండా 18

కం. విలువలు పెంచని చదువును
మలి రెప్పను వేయు లోపు మానగ వలెరా
తెలిసి విషము తినడెవ్వడు
బలమని పల్కినను కూడ బంగరు కొండా 19

కం. సాయము చేయుట మరువకు
హేయమ్మది గేలి సేయ హీనతయు నగున్
తీయని యీ నా పలుకుల
బాయక మది నిల్పుకొనుము బంగరు కొండా 20

కం. తత్తర పాటును మానుము
చిత్తములో శాంతమెపుడు చెదరక నిల్చున్
మెత్తని పల్కుల పలికిన
వత్తురు నీ వెంట జనులు బంగరు కొండా 21

కం. లోకజ్ఞానమ్మించుక
లేకున్నను లోకమందు లేనట్లౌనే
"మీకేమండీ" యంచును
బాకాలూదంగబోకు బంగరు కొండా 22

కం. చెప్పుడు మాటల వినకుము
తప్పుడు పనులన్న వాని దరి బోకుమయా
నిప్పది కాల్చక మానదు
పప్పని మొద్దని పిలిచిన బంగరు కొండా 23

కం. చదివెడి వేళల చదువక
మదినంతయు నాటలందు మరి మరి నిలుపన్
చెద పట్టిన చెట్టువలెను
పదిమందిని చులకనౌను బంగరు కొండా 24

కం. వేళకు నన్నము తినుటయు
వేళకు చదువులు చదువుట వేళకు నాటల్
వేళకు నిద్దురపోవుట
బాలులకవి మేలు గూర్చు బంగరు కొండా 25

కం. చదువన్నది యలసటగా
యెద బరువను భావమేల యెవ్వరికైనన్
వదలక గ్రోలుము సుధవలె
పదిలముగా నిన్ను గాచు బంగరు కొండా 26

కం. ఒరులకు సాయము చేయుట
మరువక జ్ఞాపకమిడుటను మంచిని పొందన్
సిరిగని మిడుకక నడుచుట
పరువుగ బ్రతుకంగ మేలు బంగరు కొండా 27

కం. నమ్మిన సిద్ధాంతమ్మును
నెమ్మనమున నిలుపుకొనుచు నిశ్చల మతివై
సొమ్ముల కొరకై లొంగక
వమ్మును చేయక నడువుము బంగరు కొండా 28

కం. చక్కని చిరునవ్వు గలిగి
దృక్కుల ప్రేమామృతమును తీరుగ నిడుచున్
మక్కువ మీరగ చేతలు
వాక్కుల మధువొలక నిమ్ము బంగరు కొండా 29

కం. ఓటమి గెలుపున భాగము
చేటాయెననుచు వగచుట చేటును గూర్చున్
మేటిని నేనని చూపగ
పాటుపడుట మేలు నీకు బంగరు కొండా 30

కం. కష్టించక సుఖమేదని
శిష్టులు గుర్తెరిగి నడుచు చిత్తమువారై
కష్టములకు క్రుంగరెపుడు
స్పష్టమ్మాయె కద నీకు బంగరు కొండా 31

కం. పరిసరముల గమనింపుము
పెరవారలను సరివారి వేరుగ గనుచున్
మరువక మంచి చెడుగులను
పరువుగ బ్రతుకుటయె మేలు బంగరు కొండా 32

కం. శక్తికి కొదవే యుండదు
యుక్తిగ దాని నుపయోగ యోగ్యము చేయన్
రక్తిని వీడకు నేర్వగ
భక్తియు శ్రద్ధయు విడువక బంగరు కొండా 33

కం. ఆదరమున గనుమెప్పుడు
సోదర భావమ్మొ కలిగి సురుచిర మతివై
పేదని పెద్దని చూడకు
వాదించకు హాస్యమునకు బంగరు కొండా 34

కం. భావము ముఖ్యము భాషకు
జీవమ్మది శబ్దములకు చేవను గూర్చున్
నీవని నేనని చూడక
పావనతను కూర్చుచుండు బంగరు కొండా 35

కం. కరుణను గుండెల నింపుము
పరుషపు పలుకుల పలుకుట వదిలిన మేలౌ
చిరకాలము గుర్తుందువు
పరమాత్మయు ప్రీతి చెందు బంగరు కొండా 36

కం. కోరిన వన్నియు నీయడు
చేరును యోగ్యత ఫలముగ క్షేమము గూర్పన్
మారక దైవమ్మందున
భారమ్మిడి సాగిపొమ్ము బంగరు కొండా 37

కం. తిరుగకు గొప్పలు చెప్పుచు
పరులకు తప్పులు వెదుకుట పాపంబగులే
మురియుట కూడదు మెప్పుల
పరువుగ బ్రతుకుటయె మేలు బంగరు కొండా 38

కం. తెలిపినది తెలియు ననుటయు
తెలియనిచో బిడియపడక తెలియందగులే
తెలివగునట వినుమియ్యది
పలువురు పెద్దల పలుకులు బంగరు కొండా 39

కం. కారణమరయుచు చదివిన
ప్రేరణ కల్గును చదువగ, ప్రేమయు కలుగున్
సారము తెలియును విద్యల
భారమ్మని తలుపరాదు బంగరు కొండా 40

కం. సాయము చేయుట మేలగు
ప్రాయములో నీ సములగు బాలల కొరకై
ధ్యేయము నలుగుర గెలుచుట
బాయక నేర్వగ చదువులు బంగరు కొండా 41

కం. విలువీయక మాటాడక
తొలి నేర్చిన మాతృభాష దోషంబగులే
కులదైవ దూషణ వలెను
పలుభంగుల భ్రష్టమౌను బంగరు కొండా 42

కం. ఆకలి వేళన్ తినవలె
పాకము శుచియైనదైన వాంఛింప తగున్
లేకిగ తిన్నను నోరే
వాకిలి రోగములకౌను బంగరు కొండా 43

కం. ఏ కాలములోని పనుల
నాకాలములోన చేయుమంకిత మతివై
కాకాలను నమ్ముకొనక
బాకాలను నూదకుండ బంగరు కొండా 44

కం. అర్థము కావలె పలికిన
అర్థము కానట్టి పలుకు కర్థము లేదే
వ్యర్థంపు పలుకులాడకు
వ్యర్థపు మాటాడ కీడు బంగరు కొండా 45

కం. స్నేహము మిక్కిలి గొప్పది
స్నేహపు విలువల తెలియుట క్షేమకరమ్మౌ
స్నేహితులుండుట యోగము
బాహిరమంతర సుఖమిడు బంగరు కొండా 46

కం. అప్పుల చేయకుమెన్నడు
గొప్పలకై ఖర్చు వలదు గోరంతైనన్
తప్పది డబ్బులు ఖర్చిడ
పప్పులు బెల్లంబులట్లు బంగరు కొండా 47

కం. ఓపిక కలిగిన నాడుల
పాపాలను చేయువారు భయమే లేకన్
ఓపిక యుడిగిన పిదపను
వాపోయిన లాభమేమి బంగరు కొండా 48

కం. నమ్మకమెంతయొ గొప్పది
నమ్మిక చెడినంత విలువ నశియించునులే
మిమ్మిక నెన్నడు నమ్మరు
వమ్మగు యత్నముల చూడ బంగరు కొండా 49

కం. అందర కలుపుకు పోవలె
నందరిలో మంచి చూడుమన్యంబేలా
కుందకు కుంచిత బుద్ధిని
వందనమందంగ వచ్చు బంగరు కొండా 50

కం. ఆస్తులు శాశ్వతమనకుము
నేస్తములే మంచి యాస్తి నిజముగ కనుమా
కాస్తంత మంచి పంచుట
వాస్తవమున గొప్ప యాస్తి బంగరు కొండా 51

కం. స్నేహము చేసెడి వేళల
స్నేహితుల గుణగణనమ్మె క్షేమము గూర్చున్
ద్రోహము కులముల నెన్నుట
బాహిర వేషముల నెన్న బంగరు కొండా 52

కం. బహిరాకారములను గని
యహరహమును విలువనీయ నన్యాయమ్మొ
సహృదయము గనక యున్నను
బహువిధముల భంగపాటు బంగరు కొండా 53

కం. వెల కట్టుట కూడని పని
ఫలితమ్మది పొందగలవు బాహుళ్యముగా
మెలకువతో నియమమ్ముగ
పలుమారులు చదివినంత బంగరు కొండా 54

కం. అది యిదియని చెప్పనులే
మది మెచ్చన్ తోచినట్టి మంచివి చేతల్
చదువులు మరువక చేయన్
పదిమందికి మేలు కల్గు బంగరు కొండా 55

కం. గుణకరమౌ మాట వినుము
కణకణమును కూడబెట్టి కాంచుము ప్రగతిన్
ఋణమన్నది చేయవలదు
వ్రణమట్లుగ బాధ పెట్టు బంగరు కొండా 56

కం. రుచికరమని మితి మీరగ
శుచి శుభ్రత మంచి చెడుగు చూడక తినుటల్
విచలితమౌ నారోగ్యము
వచియింపగ శక్యమౌనె బంగరు కొండా 57

కం. కొబ్బరి వలె కొందరిలో
మబ్బుగ మాట కటువౌను మనసది వెన్నొ
నిబ్బరముగ నిజమెరుగుము
పబ్బము గడుపుటకు కాక బంగరు కొండా 58

కం. దైవము లేడనబోకుము
దైవమ్మన సర్వ శక్తి తత్త్వమ్మనియే
నీవెరుగకున్న తాతల
భావించిన విధముగానె బంగరు కొండా 59

కం. ఎప్పటి పాఠములప్పుడె
తప్పక చదువంగ వలయు తత్తర వీడన్
కుప్పగ పేరుకు పోయిన
పప్పులుడకక వంచెరుగుము బంగరు కొండా 60

కం. స్పర్థను విద్యయె పెరుగును
సార్థక్యము కల్గునట్లు చదువగ వలయున్
అర్థము కానట్టి చదువు
వ్యర్థమ్మైపోవు గనుక బంగరు కొండా 61

కం. ఉన్నతమగు స్థితిమంతుల
సన్నుతితో నాదరించు సద్గుణ మతివై
మిన్నగు సుఖముల బడయగ
వన్నెను పెంచును సతతము బంగరు కొండా 62

కం. కారుణ్యము కలిగి మెలుగు
దారుణ దుఃఖమ్ము కలిగి దైన్యము తోడన్
భీరువులై మనువారల
వారించియు సాయపడుము బంగరు కొండా 63

కం. పుణ్యము కలిగిన వారల
గణ్యుల శుభ లక్షణులను కలియుట మేలౌ
నాణ్యంబౌ భావికి కా
ర్పణ్యము వీడి వినమందు బంగరు కొండా 64

కం. దుష్టుల చేరగ బోకుము
నిష్టగ నీ సూత్రమెపుడు నిల్పగ మదిలో
కష్టములెన్నడు కల్గవు
స్పష్టముగా తెలిసికొనుము బంగరు కొండా 65

కం. పెద్దల మాటల మరువకు
కొద్ది తెలివి యొక్క విలువ గొల్వగ తరమే
పెద్దల యనుభవమయ్యది
వద్దనకుము నీకె హాని బంగరు కొండా 66

కం. నీకై పెద్దల పలుకులు
మా కాలము వేరనుచును మారాడకుమీ
ఏ కాలమైన ధర్మమె
ప్రాకారమ్మౌచు గాచు బంగరు కొండా 67

కం. మాటల పొందిక ముఖ్యము
తూటాలను పోలు మాట తూలక యుండన్
మాటలు హాయిగ నుండిన
బాటయె విజయ పథమ్మగు బంగరు కొండా 68

కం. మగ్నంబౌచు పనుల ను
ద్విగ్నత మానక చరించ వీగుట జరుగున్
అగ్నికి వాయువు కలసిన
భగ్నమ్మౌ రీతిగాను బంగరు కొండా 69

కం. నీ కడ కలిగినవిత్తువు
నీ కడ లేకున్ననెట్లు నీవిత్తువయా
నీకడ ప్రేమయొ, ద్వేషమొ
ప్రాకటముగనున్నదేమి బంగరు కొండా 70

కం. మనసుకు నచ్చిన పనులను
మనసిడి చేయుము సతతము మంచికి నెలవై
కన నీ చిత్తము చేతయు
పనిలో చూపుము మరువక బంగరు కొండా 71

కం. ఒకరిని పెద్దగ చేయుచు
నొకరిని పిన్నగను చూడ నొప్పదు వినుమా
ఒకరికి నొకరని తెలియుము
పకపక నవ్వకు నిజమిది బంగరు కొండా 72

కం. విజయము రాకను కృంగి య
పజయమ్మని నీరస పడి వదులుట తగునా
నిజమగు ననుభవ మనుచును
భజియించుము నీ మనసున బంగరు కొండా 73

కం. లోకులు నిన్నేమనినను
నీకెందుకు వాని విడిచి నిశ్చల మతివై
లోకమ్మును ప్రేమించుము
వాకిలి తెరుచును విజయము బంగరు కొండా 74

కం. చదువది ముగియదు తెలియుము
చదువుము లోకపు నడవడి సాకల్యముగా
మది జీవిత విద్యార్థిగ
పదిలముగా గుర్తెరుగుము బంగరు కొండా 75

కం. మరువకు ప్రశ్నించుట, మరి
మరువకు మన్వేషణార్తి మార్గము కొరకై
మరువకు సాధించుటయును
వరుసగ జయములు కలుగును బంగరు కొండా 76

కం. మరువకు తాలిమినుండుట
మరువకుమా పట్టుదలను మరువకు మోర్పున్
మరువకు గమ్యము నెప్పుడు
వరియించును శుభము నిన్ను బంగరు కొండా 77

కం. బుద్ధిని నిలకడనుంచుచు
శ్రద్ధగ పనులందునుండ జాగును వీడన్
శుద్ధిగ శుభములు కలుగగ
బద్ధకమది శత్రువందు బంగరు కొండా 78

కం. నీదగు వైఫల్యమునకు
నీదే బాధ్యతయు తప్పు నీదే యనుచో
కాదనుచో దిద్దుకొనక
వాదింతువు వ్యర్థముగను బంగరు కొండా 79

కం. పరుషముగానన దలచిన
మరిచియు నే మనిషి వెనుక మాట్లాడకుమా
దరిరానీయరు నిన్నిక
పరికించి మది నిడుకొనుము బంగరు కొండా 80

కం. కష్టము కల్గిన వేళను
కష్టమునకు కారణమును కనుగొన వలె దా
నిష్టముగ మాన తప్పుల
భ్రష్టత్వము పొందరపుడు బంగరు కొండా 81

కం. నీ తీరుగ వేరొక్కరు
లేతీరుగ యోచనముల నెదనిల్పుదురో
చేతన వేరుగ నుండుట
స్వాతంత్ర్యపు కారణమ్ము బంగరు కొండా 82

కం. ఆరోగ్యమ్మది భద్రము
పేరిడి దేహము మనసుకు వేదన లేకన్
తీరుగ కాపాడుకొనుము
భారమనారోగ్యమనగ బంగరు కొండా 83

కం. పెద్దవి మాత్రమె గొప్పని
యెద్దేవా చేయకు మరి హీనత కనకన్
ముద్దుగ చిన్ని విషయముల
వద్దనక విలువను కనుము బంగరు కొండా 84

కం. సాయము చిన్నదె యయినను
మాయక మది నిలుపుకొనుము మన్నన తోడన్
బాయకు కృతజ్ఞత నెపుడు
ప్రాయికముగ నీ నడతను బంగరు కొండా 85

కం. ఊహల నూయల లూగుచు
నాహా యనిపించు భంగి నాలోచనలన్
స్నేహమ్మున నిజము సలుప
బాహిరమున కృషిని సల్పు బంగరు కొండా 86

కం. సంకోచము కల్గినపుడు
జంకొందక లోన నుండు శబ్దము వినుమా
శంకల భయముల తీర్చును
పంక రహిత ముకురము వలె బంగరు కొండా 87

కం. ఒకరిని మెప్పించుటకై
తికమక పడి నిన్ను నీవు తెగ మార్చుకొనన్
నికరముగా నీవుండవు
ప్రకరములో నలుసు వలెను బంగరు కొండా 88

కం. గడచిన క్షణమది మారదు
సుడిబడి దుఃఖించినంత సుఖకరమగునే
పడి లేచినట్లు సరిగొని
వడివడి ముందుకు చనవలె బంగరు కొండా 89

కం. ఏమియు తోచక, యొంటరి
వై మసలెడి వేళ మనసు బరువౌ వేళల్
నా మాటల మరువకుమా
ప్రామాణికమాత్మ బోధ బంగరు కొండా 90

కం. చకచక పరుగుల మానుము
ఒక పరి నిలకడగ నిల్చి యోపిక తోడన్
వికలపు మనసుకు సుఖమగు
ప్రకృతిని గమనించి చూడు బంగరు కొండా 91

కం. విత్తది మొక్కగు, చెట్టగు
క్రొత్తగనే మున్నదనమె కోపము తోడై
అత్తరి మార్పుల నొక సం
పత్తుగ చూడవలయు కద బంగరు కొండా 92

కం. తృప్తిం గలిగిన సుఖమగు
తృప్తిం బొందని మనుజుడు దీనుండగునే
లుప్తంబని కుంద వలదు
ప్రాప్తంబది వచ్చితీరు బంగరు కొండా 93

కం. గట్టును దాటక సంద్రము
గుట్టుగ తన పరిధి నుండ కొండాడుదుమే
అట్టుల మనలను మెత్తురు
పట్టుగ హద్దుల మెలగిన బంగరు కొండా 94

కం. సెలవన్నది లేకుండగ
నిలకడగను పుస్తకముల నిత్యము చదువన్
నెలవౌదువు జ్ఞానమునకు
పలుమారులు చెప్పుచుంటి బంగరు కొండా 95

కం. పేరుకు చదువుట చాలదు
చేరిన మదిలోకి మేలు చేతగ మారున్
చేరక ననుభవమన్నది
పారము నీకెట్లు తెలియు బంగరు కొండా 96

కం. తెలియని నిప్పొకటున్నది
తెలియుమదే యీర్ష్య యనుచు తీవ్రత మెండౌ
తెలివిగ దానిని విడువక
వలవల యేడ్చుట మిగులును బంగరు కొండా 97

కం. తెలిసియు తెలియకయైనన్
పలుమారులుచేయుచుండ పని యేదైనన్
నెలవై మనసునుబట్టగ
ఫలమధికము పొందవచ్చు బంగరు కొండా 98

కం. తీరిక లేదని మానక
కూరిమితో మౌనముంట కూర్చును కలుముల్
తీరుగనాత్మ విమర్శను
పారగులై మెల్గవచ్చు బంగరు కొండా 99

కం. పుటమును పెట్టిన పసిడిని
స్ఫుటముగ స్వచ్ఛత కలిగిన చొప్పున మిగులన్
కటువగు పెద్దల మాటలు
పటుతరముగ నిన్ను దిద్దు బంగరు కొండా 100

కం. తెలియని వెన్నియొ కలవని
తెలియంగా తీవ్ర కాంక్ష తెలివిగ నిలుపన్
కలబోసిన నుత్సాహము
బలయుతమై నిల్తురంట బంగరు కొండా 101

కం. నీతో చదివెడి వారిని
నీ తోడుత నడచునట్లు నేర్పుము దీక్షన్
జేతలగుదు రందరికన్
ప్రాతఃకాలపు రవివలె బంగరు కొండా 102

కం. మరువకు సంస్కృతినెన్నడు
మరువకు పెద్దలు నడచిన మంచి పథమ్మున్
మరువకు మానవు లొకటని
పరమత సహనమ్ము కల్గి బంగరు కొండా 103

కం. ఆటవిడుపు కోసమనియు
మేటిగ పదిమంది తోడ మెలుగుట నేర్వన్
దీటగు విహార యాత్రల
పాటించుచు చన వలయును బంగరు కొండా 104

కం. గురువుల భక్తిగ కొలువుము
సిరి వేరుగ లేదు గురువు శిక్షణ కంటెన్
మరిమరి మనసున నిడుకొని
పరువుగ మనవలె సతతము బంగరు కొండా 105

కం. సంతోషము తో నుండుము
సుంతైనను బిడియపడకు సుద్దులు నేర్వన్
చింతన్నది దరి చేరదు
పంతాలకు పోక మెలగ బంగరు కొండా 106

కం. దేవుళ్ళ పై శతకముల్
పూవుల వలెనుంచి తొల్లి పూనితి వ్రాయన్
మీవంటి ముద్దు పిల్లల
భావికి చిరుదీపమట్లు బంగరు కొండా 107

కం. పిల్లలు మీరని చెప్పితి
కొల్లలుగను నీతులున్న కొద్దిగ నిచటన్
ముల్లని యావల వేయక
వల్లించుము నీతులన్ని బంగారు కొండా 108

కొందరు మిత్రుల మాట!

"బంగారు కొండా" శతకము
సింగారము లొలుకు పద్య శైలూషిగ నా
రంగేట్రము సేయు సభా
రంగమ్మున బెంగలూరు రసికులు మెచ్చన్.

అర్కసోమయాజి, పద్యకవి, సంస్కృతాంధ్రపండితులు

"అమ్మదయ" అనంతం!!! బావాజీఎర్రమిల్లి, పద్యకవి

అవనిని మ్రోసెడి శేషువు
కే వనమైనను సులువుగనే తోయున్ ! మీ
భావాంభోనిధిలోనన్
భావమ్ములకు కరువేమి వాణీపుత్రా??

మఠంశివకుమార్, పద్యకవి, ప్రభుత్వోద్యోగి

అమృత బిందువులు అలాఅమ్మదయామృత
వర్షంలోనుంచి చల్లగా అలాఅలా
జాలువారినై కదాసారూ,

కడియాలశ్రీదేవి, పద్యకవి, ప్రభుత్వోద్యోగి

వాణీకరుణ రసామృత
పాణీ మీహృదయవాసిపరికించునుగా!
కోణమదేదైనాసరిజి
రాణించును పద్యధారరంజిల్లు హృదిన్!

మాడుగులమురళీధరశర్మ, పద్యకవి